సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శనివారం । 16 । సెప్టెంబర్ । 2023



రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నిత్యాన్నదాన భవన నిర్మాణానికి బొక్కా వెంకన్నబాబు, లోహిత దంపతులు (నార్కెడ్‌మిల్లి) శుక్రవారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.



డెల్టాలకు నీరు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం తూర్పు డెల్టాకు 4,600, మధ్య డెల్టాకు 2,200, పశ్చిమ డెల్టాకు 7,000 క్యూసెక్కుల చొప్పున గోదావరి జలాలు విడుదల చేశారు.

రూ.3.90 లక్షల వెండి సామగ్రి సమర్పణ



ఆత్రేయపురం: ర్యాలి ఆంజనేయ స్వామి వారికి గ్రామానికి చెందిన మణికంఠ వెహికల్ ఫైనాన్స్ అధినేత పువ్వల నాగభూషణం, కుటుంబ సభ్యులు శుక్రవారం రూ.3.90 లక్షల విలువైన వెండి కవచం, మూతి, గద తదితర వస్తువులు సమర్పించారు.

న్యూస్‌రీల్

రాష్ట్ర స్థాయి అండర్-11 షటిల్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభించిన అనంతరం చిన్నారి క్రీడాకారులతో ఎమ్మెల్యే రాపాక, కలెక్టర్ శుక్లా

మలికిపురం: రాష్ట్ర స్థాయి అండర్-11 బాలబాలికల షటిల్ చాంపియన్‌సిప్ పోటీలు మలికిపురం ఎంవీఎన్ జీఎస్ అండ్ ఆర్‌వీఆర్ ప్రభుత్వ ఎయిడెడ్ కళాశాల ఆవరణలోని జంపన రామరాజు క్రీడా ప్రాంగణంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, కలెక్టర్ హిమాన్షు శుక్లా ఈ పోటీలను ప్రారంభించారు. వారిద్దరూ సరదాగా తొలి గేమ్ ఆడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు. క్రీడారంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యం ఇస్తూ పుష్కలంగా నిధులు కేటాయిస్తున్నాయని చెప్పారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు - నేడు ద్వారా పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి దీటుగా అభివృద్ధి చేశారని అన్నారు. చిన్నతనంలోనే క్రీడల్లో ప్రోత్సాహం అందించే విధంగా పాఠశాలల్లో అన్ని క్రీడా సౌకర్యాలూ కల్పిస్తూ, విద్యార్థులకు అన్ని విధాలా అండగా ఉంటున్నారని అన్నారు. శ్రీ రామా బ్యాడ్మింటన్ అకాడమీ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఈస్ట్ గోదావరి బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యాన జరిగిన ఈ పోటీల్లో ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి, రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు అక్కయ్య చౌదరి, శ్రీరామా బాడ్మింటన్ అకాడమీ అధ్యక్షుడు దెందుకూరి రాంబాబురాజు పాల్గొన్నారు.

అటల్ మారథాన్‌లో జిల్లా ప్రతిభ

రాయవరం: అటల్ మారథాన్ 2022-23 ప్రదర్శనల్లో మన జిల్లా జాతీయ స్థాయిలో ప్రతిభ చాటింది. కేంద్ర ప్రభుత్వం గతంలోనే అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేసింది. జిల్లాలోని 45 ఉన్నత పాఠశాలల్లో ఈ ల్యాబ్‌లు ఏర్పాటయ్యాయి. దేశ వ్యాప్తంగా ఈ ల్యాబ్‌లలో విద్యార్థుల ఆలోచనలకు అనుగుణంగా రూపొందించిన ప్రాజెక్టులకు సంబంధించి పోటీలు ఆన్‌లైన్‌లో నిర్వహించారు. దేశ వ్యాప్తంగా 12 వేల ప్రదర్శనల్లో 20 వేల మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనగా, జిల్లాకు చెందిన నాలుగు ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. వీటిల్లో ఐ.పోలవరం మండలం జి.వేమవరం, కొత్తపేట మండలం వాడపాలెం, రాజోలు మండలం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలు, అల్లవరం జెడ్పీ ఉన్నత పాఠశాల ఉన్నాయి. జి.వేమవరం జెడ్పీ ఉన్నత పాఠశాల దేశవ్యాప్తంగా 57వ స్థానం సాధించి, స్టూడెంట్ ఎంటర్‌ప్రెన్యూర్ అవార్డు సాధించింది. జిల్లా పాఠశాలల ఎంపికపై డీఈఓ ఎం.కమలకుమారి, జిల్లా సైన్స్ అధికారి జీవీవీఎస్ సుబ్రహ్మణ్యం, రామచంద్రపురం డీవైఈఓ ఎస్ఎన్ ఫణి, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ బొజ్జా రమణశ్రీ సంతోషం వ్యక్తం చేశారు.



కాపు మహిళలకు కొండంత అండగా..

- నేడు కాపు నేస్తం నిధుల విడుదల
- విడుదల చేయనున్న సీఎం జగన్
- జిల్లాలో 36,823 మందికి లబ్ధి
- వారి ఖాతాల్లోకి రూ.55.23 కోట్లు
- వరుసగా నాలుగో ఏడాదీ ఆర్థిక సహాయం
- ఇప్పటి వరకూ రూ.207.92 కోట్ల పంపిణీ

సాక్షి, అమలాపురం: పేద, మధ్య తరగతి మహిళల ఆర్థిక ఉన్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు ఆర్థికంగా వెనుకబడిన కాపు, బలిజ, ఒంటరి కులాల మహిళలకు 'వైఎస్సార్ కాపు నేస్తం' పథకాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో శనివారం జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బటన్ నొక్కి అర్హులైన కాపు మహిళల ఖాతాల్లో కాపు నేస్తం నిధులు జమ చేయనున్నారు. చిరు వ్యాపారాలు, మధ్యతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న కాపు, బలిజ, ఒంటరి మహిళలకు ఈ నిధులు ఆర్థికంగా అక్కరకు వస్తున్నాయి.

కాపు, బలిజ, ఒంటరి కులాలకు చెందిన 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సున్న మహిళలకు ప్రభుత్వం వైఎస్సార్ కాపు నేస్తం నిధులు అందిస్తోంది. ఏడాదికి రూ.15 వేల చొప్పున ఐదేళ్లలో రూ.75 వేలు ఇస్తామని ప్రభుత్వం గతంలో తెలిపింది. ఈ క్రమంలో నాలుగేళ్లుగా క్రమం తప్పకుండా ఈ నిధులను జమ చేస్తున్నారు. ఈ ఏడాది ఇవ్వాల్సిన నిధులను సీఎం జగన్ శనివారం విడుదల చేయనున్నారు. ఈ ఏడాదితో కలిపి ఆ సామాజికవర్గాల్లోని అర్హులైన మహిళలకు ప్రభుత్వం మొత్తం రూ.60 వేలు అందించినట్టవుతోంది. 2021-22 మినహా మిగిలిన ప్రతి సంవత్సరం లబ్ధిదారుల సంఖ్య పెరుగుతూండటం విశేషం. ఈసారి జిల్లాలో అత్యధికంగా కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని 8,273 మందికి రూ.12.41 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది. బీసీ కార్పొరేషన్ ద్వారా ఈ నిధులు మంజూరు కానున్నాయి. మహిళా స్వయంశక్తి సంఘాల్లోని కాపు, బలిజ, ఒంటరి వర్గాలకు చెందిన మహిళలు వివిధ వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా బలోపేతమవుతున్నారు. స్వయంశక్తి సంఘాలకు రుణ పరపతి పెంచడం, స్త్రీనిధి ద్వారా రుణాలు ఇవ్వడంతో పాటు వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ రాయితీ వంటి పథకాల ద్వారా వీరికి ఆర్థిక ప్రయోజనాలు చేకూరుతున్నాయి. వీటితో పాటు కాపు నేస్తం వంటి సంక్షేమ పథకాల ద్వారా కూడా మేలు జరుగుతోంది.

నియోజకవర్గాల వారీగా కాపునేస్తం లబ్ధి (రూ.కోట్లలో)

నియోజకవర్గం	లబ్ధిదారులు	లబ్ధి
అమలాపురం	5,786	8.68
పి.గన్నవరం	6,105	9.16
కొత్తపేట	8,273	12.41
మండపేట	4,481	6.72
ముమ్మిడివరం	3,203	4.80
రామచంద్రపురం	3,344	5.02
రాజోలు	5,613	8.45

నాలుగేళ్లుగా చేకూర్చిన లబ్ధి (రూ.కోట్లలో)

సంవత్సరం	లబ్ధిదారులు	లబ్ధి
2020-21	34,652	51.97
2021-22	32,188	48.28
2022-23	34,962	52.44
2023-24	36,823	55.23

జగన్ ప్రభుత్వంలోనే కాపులకు మేలు



కాపులకు ఇప్పటి వరకూ ఏ ముఖ్యమంత్రి హయాంలోనూ జరగనంత మేలు జగన్ ప్రభుత్వంలోనే జరిగింది. వివిధ పథకాల ద్వారా అందే లబ్ధి మాత్రమే కాకుండా కాపు, బలిజ, ఒంటరి వర్గాల మహిళలకు నేరుగా లబ్ధి చేకూర్చిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతోంది.

– చీకట్ల కిషోర్, చైర్మన్, రాష్ట్ర కాపు కార్పొరేషన్, ఉప్పలగుప్తం

ఆర్థికంగా బలోపేతం కావాలని..



కాపు వర్గానికి చెందిన పేద, మధ్య తరగతి మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కాపు నేస్తం పథకం కింద ఏటా క్రమం తప్పకుండా నిధులు ఇస్తోంది. ఈ నిధులను వ్యాపార అవసరాల కోసం వినియోగించుకోవాలి. చిన్నచిన్న పెట్టుబడులుకు అప్పులు చేయకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇస్తున్న సొమ్ములను సద్వినియోగం చేసుకోవాలి.

– తిక్కా వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమ అధికారి, అమలాపురం

ఇది మూడోసారి



గత రెండేళ్లు నాకు కాపు నేస్తం సొమ్ములు పడ్డాయి. ఈ ఏడాదితో ఇది మూడోసారి. సీఎం జగన్ ఇస్తున్న సొమ్ములు మా కుటుంబం నిర్వహించే పండ్ల వ్యాపారానికి అక్కరకు వస్తున్నాయి. కాపు నేస్తం పథకం ద్వారా మాలా చాలా మంది లబ్ధి పొందుతున్నారు.

– నిమ్మకాయల వరలక్ష్మి, గాంధీనగర్, అమలాపురం

నేడు నిడదవోలుకు ముఖ్యమంత్రి జగన్

- వైఎస్సార్ కాపు నేస్తం రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి హాజరు
- పర్యటనకు ఏర్పాట్లు పూర్తి



నిడదవోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శనివారం ఉదయం నిడదవోలు రానున్నారు. వైఎస్సార్ కాపు నేస్తం పథకం రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం జమ చేయనున్నారు. సీఎం పర్యటనకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు కలెక్టర్ కె.మాధవీలత, సీఎం ప్రోగ్రాం కన్వీనర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు తెలిపారు. స్థానిక సెయింట్ ఆంబ్రోస్ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో సభా వేదిక వద్ద ఏర్పాట్లను వారు శుక్రవారం పరిశీలించారు. అధికారులు తమ విధులను సమన్వయంతో నిర్వర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. సభా ప్రాంగణంలో వివిధ గ్యాలరీలు ఏర్పాటు చేశామన్నారు. తలశిల రఘురాం మాట్లాడుతూ, రోడ్ షోలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సమకూర్చుతున్నామని చెప్పారు. ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ, జగన్ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

సీఎం పర్యటన షెడ్యూల్ ఇదీ..

ఉదయం 9.40: తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరుతారు.
10.10: నిడదవోలు పట్టణానికి చేరుకుంటారు.
10.20: సభా వేదిక వరకూ రోడ్డు షో.
10.30: సెయింట్ ఆంబ్రోస్ ఉన్నత పాఠశాల లోని సభా వేదికకు చేరుకుంటారు.
10.35: కాపు నేస్తం కార్యక్రమంలో పాల్గొని సభలో ప్రసంగిస్తారు.
12.10: సభ ముగిశాక సుబ్బరాజుపేటలోని హెలిపాడ్‌కు చేరుకుంటారు.
12.40: కాస్సేపు స్థానిక నాయకులతో మాట్లాడతారు.
12.45: హెలికాప్టర్‌లో తాడేపల్లికి బయలుదేరుతారు.

ఆడిటింగ్ నైపుణ్యంతో చేయాలి



ఆడిటర్ల శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న డీసీఓ రాధాకృష్ణారావు

అమలాపురం టౌన్: జిల్లాలోని సహకార ఆడిటర్లు నైపుణ్యంతో ఆడిటింగ్ చేసి, రైతులకు, పాలక వర్గాలకు పారదర్శకమైన సహకారం అందించాలని జిల్లా సహకార అధికారి (డీసీఓ) ఎ.రాధాకృష్ణారావు సూచించారు. రాష్ట్ర సహకార యూనియన్ ఆధ్వర్యాన అమలాపురంలోని జిల్లా సహకార కార్యాలయంలో జిల్లాలోని సహకార ఆడిటర్లు, చార్టర్డ్ అకౌంటెంట్లకు శుక్రవారం జరిగిన ఒక రోజు శిక్షణలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆడిట్ ఆఫ్ ఫ్యాక్ట్స్ అనే అంశంపై సహకార యూనియన్ అధికారులు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ ద్వారా ఆడిటర్లు నైపుణ్యం మరింత పెంచుకుని, సహకార చట్టంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సంఘాల్లో ఆడిట్ పూర్తి చేయాలని డీసీఓ రాధాకృష్ణారావు సూచించారు. సహకార చట్టం సెక్షన్ 50 ప్రకారం ఆడిట్‌కు సంబంధించి జరిగిన సంస్కరణలను జిల్లా సహకార ఆడిట్ అధికారి ఎస్.మురళీకృష్ణ వివరించారు. సహకార చట్టం, ఆడిట్ విధులు అనే అంశంపై అమలాపురం డివిజనల్ సహకార అధికారి టి.బుజ్జయ్య ప్రసంగించారు. ససహకార సంఘాలు - శిక్షణా కార్యక్రమాలు అనే అంశంపై రామదాసు సహకార శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ వి.శ్రీనివాస్, లెక్చరర్, జిల్లా ట్రైనర్ ఆదిమూలం వెంకటేశ్వరరావు అవగాహన కల్పించారు. శిక్షకులుగా కేవీవీ శ్రీనివాస్, జె.అప్పారావు వ్యవహరించారు.

ఇచ్చిన మాట నెరవేర్చటమే సీఎం జగన్ లక్ష్యం

- మంత్రి చెల్లుబోయిన వేణు
- కొత్త పింఛన్ల పంపిణీ



దివ్యాంగ బాలికకు కొత్తగా మంజూరైన పెన్షన్ అందిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం: నాడు ప్రజలు పడుతున్న కష్టాలను తన సుదీర్ఘ పాదయాత్రలో కళ్లారా చూసి, వాటిని తీర్చేందుకు ఇచ్చిన మాటను నెరవేర్చటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ఇందులో భాగంగానే కొత్తగా మంజూరైన పెన్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. రామచంద్రపురం పట్టణం, మండల పరిధిలో కొత్తగా మంజూరైన పెన్షన్లను స్థానిక లయన్స్ కల్యాణ మండపంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మంత్రి వేణు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో కొత్త లబ్ధిదారులు సంఖ్య 266 మంది ఉన్నారని, వీరికి ప్రతి నెలా పెన్షన్లుగా రూ.7,44,250 ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పారు. పట్టణంలో మొత్తం 4,626 మంది లబ్ధిదారులున్నారని, వీరికి ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్ అందిస్తామని తెలిపారు. అలాగే, రామచంద్రపురం మండలంలో కొత్త లబ్ధిదారులు 626 మంది కాగా వీరికి రూ.17,64,750 మేర ప్రతి నెలా పెన్షన్లు చెల్లించనున్నామని చెప్పారు. వీటితో కలిపి మండలంలో మొత్తం లబ్ధిదారుల సంఖ్య 11,805కు పెరిగిందన్నారు. నియోజకవర్గంలో ఏటా రూ.51,24,24,000 మేర పెన్షన్లుగా ప్రభుత్వం అందిస్తోందని మంత్రి వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, కౌన్సిలర్లు వాద్రేవు సాయిప్రసాద్, బావాల మంగామణి, మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీఓ రాజు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మీ చిట్టి చేతులతో నేడు మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

ఆంధ్రప్రదేశ్
ANDHRA PRADESH
AP Pollution Control Board

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది. శనివారం జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం! జిల్లా స్పాన్సర్‌గా శ్రీ షిర్డి సాయి విద్యా సంస్థలు వ్యవహరిస్తున్నారు.

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా :

సర్ సీవీరామన్ స్కూల్
పోలీస్ స్టేషన్ వెనుక,
నారాయణపేట, అమలాపురం

తేదీ : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి
మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన
ఫోన్ నంబరు : 9010224454

District sponsor

SRI SHIRDI SAI
GROUP OF EDUCATIONAL INSTITUTIONS
RAJAHMUNDRY KADIYAM
website : www.sssjc.in

లారీని ఢీకొన్న ప్రైవేటు బస్సు

- డ్రైవర్ మృతి
- మృతుడు లంకల గన్నవరం వాసి
- ప్రయాణికులకు స్వల్ప గాయాలు

ఏలూరు టౌన్: ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొనటంతో బస్సు డ్రైవర్ మృతి చెందాడు. ఈ ప్రమాదంలో 20 మంది ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. ఏలూరు వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. కావేరీ ట్రావెల్స్‌కు చెందిన ఏసీ బస్సు హైదరాబాద్ నుంచి 30 మంది ప్రయాణికులతో కాకినాడ బయల్దేరింది. ఏలూరు వద్ద జాతీయ రహదారిపై కలపర్రు టోల్‌ప్లాజా సమీపానికి చేరుకునేసరికి ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ హఠాత్తుగా బ్రేక్ వేశాడు. దీంతో, వెనుక వేగంగా వస్తున్న ట్రావెల్స్ బస్సు ఆ లారీని వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం లంకల గన్నవరం గ్రామానికి చెందిన బస్సు డ్రైవర్ అల్లాడ వెంకట నారాయణమూర్తి(44) తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని 108 అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ప్రమాదంలో బస్సులోని 20 మంది ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. బస్సు ముందుభాగం దెబ్బ తింది. ప్రయాణికులు వివిధ బస్సులలో తమ గమ్యస్థానాలకు వెళ్లిపోయారు. ఈ ప్రమాదంపై పెదపాడు ఎస్సై చల్లా కృష్ణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి, సంక్షేమంలో ఆదర్శాంధ్రప్రదేశ్

- ఎంపీ అనురాధ, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి
- బిళ్లకుర్రులో రూ.1.03 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం



బిళ్లకుర్రులో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎంపీ అనురాధ, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని అమలాపురం ఎంపీ చింతా అనురాధ, కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. కొత్తపేట మండలం బిళ్లకుర్రు గ్రామ పంచాయతీ పరిధిలో రూ.1.03 కోట్లతో వివిధ అభివృద్ధి పథకాలను శుక్రవారం వారు ప్రారంభించారు. రూ.25 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం పై విభాగం, రూ.17.5 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం, పంచాయతీ నిధులు రూ.30 లక్షలతో నాలుగు సీసీ రోడ్లు, రూ.20 లక్షలతో నాలుగు సీసీ డ్రైన్లు, పంచాయతీ, మండల పరిషత్ నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ డ్రైన్లకు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ నెల్లి లక్ష్మీపతిరావు అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీ అనురాధ మాట్లాడుతూ, దేశంలోనే ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా మన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతిగా వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ఆదర్శంగా నిలిచారని అన్నారు. మన పథకాలను ఇప్పటికే వివిధ రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుని అమలు చేస్తున్నాయన్నారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ, ఒకపక్క ప్రజా సంక్షేమం, మరో పక్క అభివృద్ధి పథకాలతో రాష్ట్రం ముందుకు పరుగులు పెడుతోందని అన్నారు. ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట స్పెషలిస్టు వైద్యులను గ్రామాల్లో అందుబాటులోకి తీసుకువస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఆర్‌డీఓ ఎం.ముక్కంటి, ఓఎన్‌జీసీ ఈడీ అమిత్ నారాయణ, అమలాపురం పట్టణాభివృద్ధి సంస్థ (అముడా) చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి, సర్పంచ్‌లు రెడ్డి చంటి, సాగి బంగార్రాజు, ఎంపీటీసీ సభ్యురాలు బొక్కా నాగరాణి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ధరిత్రికి ఛత్రం పడదాం

- కాలుష్యాలతో భూమాతకు ముంచుకొస్తున్న ముప్పు
- పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం కృషి
- ప్రజల్లో అవగాహనకు విస్తృత కార్యక్రమాలు
- నేడు అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం

రాయవరం: సూర్యుడితో పాటు విశ్వం నుంచి వెలువడే అతి నీలలోహిత కిరణాల ధాటికి పుడమి తల్లి రక్షణ కవచం కరిగిపోతోంది. ఫలితంగా పర్యావరణ సమతుల్యత దెబ్బ తింటోందని పర్యావరణ వేత్తలు ఆందోళన చెందుతున్నారు. దీనికి మానవ తప్పిదాలే ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. పారిశ్రామిక కాలుష్యం, విచ్చలవిడిగా వాహనాలు, ఏసీలు, ఫ్రిజ్‌ల వినియోగం పెరగడం, అటవీ విస్తీర్ణం తగ్గిపోవడంతో ఓజోన్ పొర దెబ్బతింటోంది. పర్యావరణానికి ముప్పు వాటిల్లుతున్న ఇటువంటి పరిస్థితుల్లో భూమాతను రక్షించేందుకు ప్రభుత్వం తన వంతు కృషి చేస్తోంది. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడంలో భాగంగా శనివారం ఓజోన్ పరిరక్షణ దినోత్సవం నిర్వహణకు ప్రభుత్వం, పర్యావరణ, ప్రకృతి ప్రేమికులు సన్నద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా అంబాజీపేట మండలం తొండవరం, కె.గంగవరం మండలం సత్యవాడ జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో డివిజన్ స్థాయి ఓజోన్ పరిరక్షణ దినోత్సవాలు నిర్వహిస్తున్నారు.

ఓజోన్ పొర లాభమేమిటంటే..

సూర్యుని నుంచి బయలుదేరిన కిరణాలు భూమిని చేరడానికి 8 నిమిషాలు పడుతుంది. ఈ సూర్య కిరణాల్లో జీవావరణానికి ఉపయోగపడే వాటితో పాటు జీవరాశికి వినాశనం కలిగించే అతి నీలలోహిత (అల్ట్రా వయొలెట్) కిరణాలు కూడా ఉంటాయి. అతి నీలలోహిత కిరణాలు నేరుగా భూమికి చేరితే జరిగే రసాయనిక చర్య వల్ల భూమండలం మొత్తం రేడియేషన్ వ్యాపిస్తుంది. తద్వారా జీవుల మనుగడ కష్టమవుతుంది. భూమికి 20 నుంచి 30 కిలోమీటర్ల ఎత్తులో ఎటువంటి రంగూ లేకుండా ఉన్న పొరనే ఓజోన్ పొర అంటారు. ఇది సూర్యుని నుంచి వెలువడే అతి నీలలోహిత కిరణాలను అడ్డుకుంటుంది. ఫలితంగా పగటి వేళ ఆకాశం నీలి రంగులో కనిపిస్తుంది. సూర్యాస్తమయం తరువాత ఎటువంటి నీలలోహిత కిరణాలూ ఈ పొరపై ప్రసరించవు కాబట్టి దీని గుండా మనం నక్షత్రాలను చూడగలుగుతున్నాం.

దెబ్బ తింటోందిలా..

గడచిన పదేళ్లలో ఏసీలు, ఫ్రిజ్‌ల వినియోగం కొన్ని రెట్లు పెరిగిపోయింది. వీటి నుంచి విడుదలయ్యే ఉద్గారాలు ఓజోన్ పొరను విచ్ఛిన్నం చేస్తున్నాయి. వ్యక్తిగత వాహనాల సంఖ్య, వినియోగం విపరీతంగా పెరగడంతో వాటి నుంచి వెలువడుతున్న ఉద్గారాలు కూడా ఓజోన్ పొరకు హాని చేస్తున్నాయి. జిల్లాలో రవాణా శాఖ లెక్కల ప్రకారం నాన్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు 4,37,716 ఉండగా ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు 42,199 ఉన్నాయి. ఈ వాహనాల నుంచి, ఏసీల నుంచి వెలువడుతున్న నైట్రోజన్ ఆక్సైడ్‌లు, క్లోరోఫ్లూరో కార్బన్లు ఓజోన్ పొరను దెబ్బ తీస్తున్నాయి. దీనివల్ల అతి నీలలోహిత కిరణాలు భూమిని తాకుతున్నాయి. ఇది వృక్షజాతుల వినాశనానికి కూడా కారణమై, ఆక్సిజన్ శాతాన్ని తగ్గించి మానవ మనుగడకు ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. మనుషులు, జంతువుల్లో చర్మ క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులకు కారణమవుతోంది. ఇంకా జన్యువులు, కళ్లు దెబ్బ తినడంతో పాటు సముద్ర జీవరాశిపై దుష్ప్రభావం పడుతోందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఆప్కాస్ట్ ఆధ్వర్యంలో..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర, సాంకేతిక మండలి (ఏపీసీఓఎస్‌టీ – ఆప్కాస్ట్) ఆధ్వర్యాన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పర్యావరణం, ప్రకృతి పరిరక్షణకు ఏడాది పొడవునా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ఏటా జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం, ఆగస్టు 6, 9 తేదీల్లో హిరోషిమా – నాగసాకి దినోత్సవం, సెప్టెంబర్ 16న ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఓజోన్ పొర ఆవశ్యకత, పరిరక్షణపై సామాజికవేత్తలతో కలిసి ర్యాలీలు చేపడుతున్నారు. ఈ విషయంలో విద్యార్థులను చైతన్యపరిచేందుకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నారు. గణపతి ఉత్సవాల్లో మట్టి విగ్రహాలను ప్రోత్సహించేలా, పర్యావరణానికి హాని కలిగించే అంశాలను సమాజానికి దూరం చేసేలా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం 15 సంవత్సరాలు పైబడిన వాహనాలను స్క్రాప్ చేసేవిధంగా ఉత్తర్వులు ఇచ్చింది.

విద్యార్థుల్లో చైతన్యానికి..



పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించకుంటే భవిష్యత్తు తరాలకు తీవ్ర నష్టం కలుగుతుందనే భావనను సమాజానికి అందిస్తున్నాం. ప్రభుత్వం ప్రతి పాఠశాలలో ఎకో క్లబ్బులు ఏర్పాటు చేసి, విద్యార్థుల్లో అవగాహన, చైతన్యం కల్పిస్తోంది. వినాయక చవితికి మట్టి విగ్రహాలను వినియోగించేలా ఎకో క్లబ్‌ల ద్వారా చర్యలు తీసుకుంటున్నాం.

– కదలి సాయిరామ్, జిల్లా సమన్వయకర్త, నేషనల్ గ్రీన్‌కోర్, అమలాపురం

ఆప్కాస్ట్ ద్వారా అవగాహన



పర్యావరణ, ప్రకృతి పరిరక్షణకు ఆప్కాస్ట్ ఆధ్వర్యాన జిల్లాలో ఏడాది పొడవునా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి. ప్రభుత్వం చేస్తున్న కృషికి సహకారం అందించాలి.

– జీవీవీఎస్ సుబ్రహ్మణ్యం, జిల్లా సమన్వయకర్త, ఆప్కాస్ట్, అమలాపురం

జీవరాశి మనుగడ సాధించాలంటే..



సమస్త జీవరాశీ మనుగడ సాధించాలంటే ప్లాస్టిక్, హానికర వస్తువుల వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలి. మానవుని తప్పిదాల వల్లే ఓజోన్ పొరకు చిల్లులు పడే ప్రమాదం ఏర్పడింది. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించడంతో పాటు అడవులను పరిరక్షించాలి.

– కె.శ్రీకృష్ణసాయి, జిల్లా అధ్యక్షుడు, రేవతి సైన్స్ ఫౌండేషన్, రామచంద్రపురం

భూతాపం తగ్గించవచ్చు



ఓజోన్ పొర పరిరక్షణ ద్వారా భూతాపాన్ని తగ్గించవచ్చు. ఓజోన్ పొరను రక్షించుకుంటేనే సమస్త మానవాళి, పశుపక్ష్యాదులు మనుగడ సాగిస్తాయి. ఓజోన్ పొర దెబ్బ తినడం వలన ఇప్పటికే చాలా ప్రభావం కనిపిస్తోంది.

– నల్లమిల్లి సురేష్‌రెడ్డి, జంతుశాస్త్ర అధ్యాపకుడు, రాయవరం

మొక్కల పెంపకంతో..

జీవ వైవిధ్యాన్ని కాపాడుకుని భవిష్యత్ తరాలకు భద్రత ఇవ్వాలంటే మొక్కలు నాటడం అత్యంత అవసరం. దీనిని దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వం పాఠశాలల్లో మొక్కలు పెంచడానికి, విద్యార్థుల్లో, ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచేందుకు ప్రతి హైస్కూలులోనూ నేషనల్ గ్రీన్‌కోర్ క్లబ్బులు (ఎన్‌జీసీ) ఏర్పాటు చేసింది. జిల్లాలోని 232 ఉన్నత పాఠశాల్లో ఎకో క్లబ్బులు ఏర్పాటు చేశారు. ఇటీవల ఎన్‌జీసీ జిల్లా సమన్వయకర్త, క్లస్టర్ కో ఆర్డినేటర్లకు రెండు ఓరియెంటేషన్ తరగతులు నిర్వహించారు.

క్లుప్తంగా

ఎన్ఎంఎంఎస్ పరీక్ష ఫీజు గడువు పెంపు

రాయవరం: ప్రస్తుత విద్యా సంవత్సరంలో జరగనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) అర్హత పరీక్ష ఫీజు చెల్లింపునకు గడువును పెంచారు. ఈ గడువు శుక్రవారంతో ముగియగా, అక్టోబరు 25వ తేదీ వరకూ పెంచారు. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల కార్యాలయం సంచాలకుడు డి.దేవానందరెడ్డి నుంచి ఉత్తర్వులు వచ్చాయి. డిసెంబర్ 3న ఆయా రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తారు.

రౌడీషీటర్ హత్య కేసులో మరో ఆరుగురి అరెస్టు

అమలాపురం టౌన్: ఈదరపల్లిలో రౌడీషీటర్ పోలిశెట్టి రామకృష్ణ కిషోర్ హత్య కేసులో పోలీసులు శుక్రవారం మరో ఆరుగురిని అరెస్టు చేశారు. వీరిని కోర్టులో హాజరుపరిచామని అమలాపురం డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఈ నెల ఒకటో తేదీన ఈదరపల్లిలో రౌడీషీటర్ కిషోర్‌ను ప్రత్యర్థులు హత్య చేయడంతో పాటు అతడి స్నేహితుడు అడపా సాయి లక్ష్మణ్‌పై హత్యాయత్నం చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ కేసులో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. తాజాగా ఈదరపల్లికి చెందిన కుంపట్ల దేవేంద్ర సత్యమూర్తి, పి.గన్నవరం మండలం ముంజవరానికి చెందిన అడబాల నాయుడు, అమలాపురం కల్వకొలను వీధికి చెందిన వంగా రాజారామ్, గంధం వీర వెంకట దుర్గా ప్రసాద్, సావరానికి చెందిన దాసరి వెంకట చంద్ర పవన్, అంబాజీపేట మండలం మాచవరానికి చెందిన కంకిపాటి దయానందలను అరెస్టు చేశారు. వీరి నుంచి ఒక మోటార్ సైకిల్, 5 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులకు అమలాపురం మెజిస్ట్రేట్ కోర్టు రిమాండ్ విధించగా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. ఇప్పటి వరకూ ఈ కేసులో మొత్తం 11 మందిని అరెస్టు చేసినట్లయ్యింది. ఈ కేసులో మరికొంత మంది నిందితులను అరెస్టు చేయాల్సి ఉందని డీఎస్పీ అంబికా ప్రసాద్ చెప్పారు. వారి కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయని తెలిపారు. ఆయన ఆధ్వర్యాన పట్టణ సీఐ డి.దుర్గా శేఖర రెడ్డి బృందం ఈ కేసు దర్యాప్తు చేస్తోంది.

ప్రజారోగ్యానికి సీఎం పెద్దపీట

- రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత
- వర్చువల్ విధానంలో రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రారంభించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు



రాజమహేంద్రవరం మెడికల్ కాలేజ్ ప్రారంభోత్సవంలో వర్చువల్‌గా పాల్గొన్న మంత్రి తానేటి వనిత, ఎంపీ మార్గాని భరత్‌రామ్, కలెక్టర్ మాధవీలత, ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, తలారి వెంకటరావు తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దాదాపు రూ.8,480 కోట్లతో 17 నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలకు శ్రీకారం చుట్టారని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. విజయనగరంలో నూతన వైద్య కళాశాలను శుక్రవారం ప్రారంభించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. అనంతరం వర్చువల్ విధానంలో రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల వైద్య కళాశాలలను కూడా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి మంత్రి వనిత, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ, రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఏకకాలంలో ఐదు వైద్య కళాశాలలను ప్రారంభించడం చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరం మరో ఐదు, ఆ తర్వాత ఏడాది మిగిలిన ఏడు ప్రభుత్వ వైద్య కళాశాలలను సీఎం జగన్ ప్రారంభించనున్నారని తెలిపారు. ప్రతి వైద్య కళాశాలను రూ.500 కోట్లతో చేపట్టనున్నారన్నారు. 8.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో టీచింగ్ హాస్పిటల్, 2.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో మెడికల్ కాలేజీ, 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో హాస్టళ్లు, సిబ్బంది వసతి, క్రీడా ప్రాంగణాలతో పాటు అత్యాధునిక సాంకేతికతతో లేబొరేటరీలు, డిజిటల్ లైబ్రరీ, సీసీ టీవీల ఏర్పాటు ద్వారా ఆధునిక హంగులు కల్పిస్తున్నారని వనిత వివరించారు.

కలెక్టర్ కె.మాధవీలత మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ మన రాష్ట్రంలో 11 ప్రభుత్వ వైద్య కళాశాలలు మాత్రమే ఏర్పాటు కాగా, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ నాలుగేళ్లలో మరో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందని చెప్పారు. జిల్లాలో మల్టీ/సూపర్ స్పెషాలిటీ అధునాతన వైద్య సేవలను ఉచితంగా అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. ఆ దిశలో ప్రభుత్వాసుపత్రిని 500 పడకలతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. రాజమహేంద్రవరాన్ని విద్యా హబ్‌గా తీర్చిదిద్దడంలో భాగంగా ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేసినందుకు జిల్లా ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి వాటి ద్వారా వైద్యాధికారులు ప్రజల వద్దకే వెళ్లి వారి ఆరోగ్య స్థితిగతులు తెలుసుకుంటున్నారని అన్నారు.

రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ మాట్లాడుతూ, ప్రతి పార్లమెంటరీ నియోజకవర్గంలో ఒక ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఉండేలా వేగంగా ముందుకు అడుగులు వేయడంపై హర్షం వ్యక్తం చేశారు.

రానున్న రోజుల్లో ఈ ఆసుపత్రి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, తలారి వెంకట్రావు, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సౌభాగ్య లక్ష్మి, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ(రుడా) మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేసీఎస్ కో ఆర్డినేటర్ల నియామకం



సీహెచ్ శ్రీనివాసరాజు



పాటి శివకుమార్



కారుమంచి రమేష్



కొల్లాటి ఇజ్రాయిల్



డాక్టర్ ఒమ్మి రఘురామ్



బత్తుల నాగసాయిరామ్

కాకినాడ: తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలకు వైఎస్సార్ సీపీ జేసీఎస్ కో ఆర్డినేటర్లను నియమించారు. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదంతో వీరి నియామకాలను పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ప్రకటించింది. కోనసీమ జిల్లాకు సీహెచ్ శ్రీనివాసరాజు, పాటి శివకుమార్; తూర్పు గోదావరి జిల్లాకు కారుమంచి రమేష్, కొల్లాటి ఇజ్రాయిల్; కాకినాడ జిల్లాకు డాక్టర్ ఒమ్మి రఘురామ్, బత్తుల నాగసాయిరామ్ నియమితులయ్యారు.

ఏడాదిన్నర లోగా వశిష్ట వంతెన పూర్తి



ఊడిమూడి వద్ద ప్రధాన పంట కాలువపై నిర్మించిన వంతెనను పరిశీలిస్తున్న ఏఐఐబీ అధికారులు

పి.గన్నవరం: ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక గ్రామాల ప్రజల సౌకర్యార్థం వశిష్ట నదిపై మంజూరైన వంతెన నిర్మాణాన్ని ఏడాదిన్నరలోగా పూర్తి చేస్తామని ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) ప్రతినిధులు తెలిపారు. ఈ వంతెన నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.49.5 కోట్లు మంజూరు చేసిన విషయం విదితమే. ఇందులో భాగంగా తొలుత ప్రధాన పంట కాలువపై రూ.2.5 కోట్లతో నిర్మిస్తున్న వంతెన పనులను ఏఐఐబీ టీమ్ లీడర్ ఫర్హాద్ అహ్మద్, సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ అశోక్ కుమార్, పర్యావరణ నిపుణుడు శివ, ఏఐఐబీ ట్రాన్స్‌పోర్ట్ ఇన్వెస్ట్‌మెంట్ అసోషియేట్ తౌషిక్ తదితరులు సీఈ సుబ్బారెడ్డితో కలిసి శుక్రవారం పరిశీలించారు. నెలా 20 రోజుల వ్యవధిలో వంతెనను నిర్మించిన కాంట్రాక్టు సంస్థను, ఇంజినీరింగ్ అధికారులను అభినందించారు. అనంతరం ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, బూరుగులంక, అరిగెలవారిలంక ప్రజలతో సమావేశమయ్యారు. వంతెన ఆవశ్యతపై అడిగి తెలుసుకున్నారు. వంతెన లేకపోవడంతో ఏటా వరదల సమయాల్లో తాము పడుతున్న ఇబ్బందులను ప్రజలు వివరించారు. తమ కష్టాలు తెలుసుకున్న సీఎం జగన్ వంతెనకు రూ.49.5 కోట్లు మంజూరు చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. వంతెన అప్రోచ్, నిర్మాణ పనుల వల్ల భూములు కోల్పోతున్న రైతులను ఏఐఐబీ బృందం తెలుసుకుంది. వంతెన నిర్మాణ పనుల్లో భాగంగా పొక్లెయిన్లు, జేసీబీల వినియోగంపై మహిళలకు శిక్షణ ఇచ్చి, వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. వంతెనకు అవసరమైన భూసేకరణను పూర్తి చేసి, కాంట్రాక్టు సంస్థకు అప్పగించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. వరదలు తగ్గిన తర్వాత నదిపై వంతెన పనులు ప్రారంభిస్తామని పంచాయతీ రాజ్ ప్రాజెక్ట్ డీఈఈ అన్యం రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏఐఐబీ బృందం తిలకించింది. ఇంజినీరింగ్ అడ్వైయిజర్ ప్రభాకర్, ఈఈ రామారెడ్డి, చంటిబాబు, కాంట్రాక్టు సంస్థ అధినేత పీపీ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు మంతెన రవిరాజు, సర్పంచ్ దంగేటి అన్నవరం, ఎంపీటీసీ పల్లి మోషే, సాధనాల రమేష్ పాల్గొన్నారు.

ఆత్రేయపురం పూతరేకులకు భౌగోళిక గుర్తింపు

- విశాఖపట్నంలో జీఐ సర్టిఫికెట్ ప్రదానం
- ఫలించిన ఈ ప్రాంత వాసుల కృషి



జీఐ ట్యాగ్ సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న దృశ్యం

ఆత్రేయపురం: భౌగోళిక గుర్తింపుతో (జియోగ్రాఫికల్ ఐడెంటిటీ – జీఐ) ఆత్రేయపురం పూతరేకుల కీర్తి జాతీయ స్థాయికి చేరింది. తరతరాల వారసత్వ సంపదగా వస్తున్న పూతరేకుల తయారీలో ఈ ఊరికే పూర్తి స్థాయి గుర్తింపు, హక్కులు ఉన్నాయని తేలింది. విశాఖపట్నం దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఆత్రేయపురం పూతరేకులకు జీఐ ట్యాగ్ సర్టిఫికెట్‌ను శుక్రవారం ప్రదానం చేశారు. ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ (ఐపీఆర్) ఏపీ, తమిళనాడు అధ్యక్షులు సుధ, సంజయ్‌గాంధీల నుంచి సర్ ఆర్థర్ కాటన్ ఆత్రేయపురం పూతరేకుల తయారీదార్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ముదునూరి రామరాజు, సభ్యులు ఈ సర్టిఫికెట్లు అందుకున్నారు. అనంతరం వారికి సంఘ సభ్యులు వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందించి, ఆలయ చరిత్రను వివరించారు.

ఆత్రేయపురం పూతరేకులు లోగో

ఏడాదిన్నరగా కృషి

ఆత్రేయపురం పేద మహిళలు నాలుగు దశాబ్దాలుగా చూపుతున్న నైపుణ్యం, పడుతున్న కష్టానికి ఎట్టకేలకు ఓ గుర్తింపు దక్కింది. ఇక్కడి పూతరేకుల తయారీకి భౌగోళిక గుర్తింపును సాధించే కృషిలో సంఘం అధ్యక్షుడు రామరాజు, ఉపాధ్యక్షుడు చిలువూరి రామకృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శి పీఎస్ రాజు, కోశాధికారి గాదిరాజు ప్రసాదరాజు తదితరులు పాలు పంచుకున్నారు. వీరి ప్రయత్నాలకు దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు తోడయ్యారు. ఆత్రేయపురం వచ్చి పూతరేకులకు, ఈ గ్రామానికి ఏర్పడిన విడదీయరాని అనుబంధానికి సంబంధించి వివిధ ఆధారాలు సేకరించారు. ఉపాధిగా మారి ఎగుమతుల స్థాయికి చేరిన ఈ ఆహార ఉత్పత్తిపై డాక్యుమెంట్లు తయారు చేశారు. 2021 డిసెంబర్ 13న చెన్నైలోని జియో ఐడెంటిటీ కార్యాలయానికి అధికారికంగా దరఖాస్తు సమర్పించారు. దీనిపై ఆధారాలతో హాజరు కావాలని కొద్ది నెలల అనంతరం చెన్నై కార్యాలయం నుంచి ఇక్కడి వారికి ఆహ్వానం అందింది. ఆత్రేయపురం నుంచి ఏడుగురు సభ్యులు జీఐ కార్యాలయానికి వెళ్లారు. వివిధ రంగాలకు చెందిన తొమ్మిది మంది నిపుణులు వీరిని లోతుగా ప్రశ్నించారు. సమాధానాలు రాబట్టారు. ఈ ప్రక్రియలో ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శిగా పని చేసిన గోనెల రాజేంద్రప్రసాద్ జీఐ అధికారుల ప్రశ్నలకు తగిన సమాధానాలు ఇచ్చారు. దీనిపై వారు సంతృప్తి చెందారు. ఈ ఏడాది ఫిబ్రవరి 13న జీఐ జర్నల్‌లో ఆత్రేయపురం పూతరేకుల గురించి ప్రచురించింది. దీనిపై అభ్యంతరాలుంటే 120 రోజుల్లో తెలియజేయాలని సూచించింది. ఈ గడువు జూన్ 13 అర్ధరాత్రితో ముగిసింది. ఎలాంటి అభ్యంతరాలూ వ్యక్తం కాలేదు. దీంతో ఆత్రేయపురం వాసుల కల నెరవేరింది. ఇక్కడి పూతరేకులకు భౌగోళిక గుర్తింపు లభించింది.

పాము కాటుతో మహిళ మృతి

కాకినాడ క్రైం: పాము కాటుతో ఓ మహిళ మృతి చెందింది. వివరాలివీ.. ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లికి చెందిన కొర్లపాటి లక్ష్మి (60) శుక్రవారం మధ్యాహ్నం భోజనం చేసి ఇంట్లో కుర్చీలో విశ్రాంతి తీసుకుంటోంది. అప్పటికే ఇంట్లోకి చొరబడిన ఓ తాచుపాము ఆమె కాలిపై కాటు వేసింది. ఈ ఘటనలో లక్ష్మి కింద పడి అపస్మారక స్థితికి చేరుకోగా కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు. శరీరం అంతా నల్లగా మారి, పరిస్థితి విషమించడంతో అక్కడి వైద్యుల సూచనల మేరకు ఆమెను కుమారుడు ఏసుబాబు కాకినాడ జీజీహెచ్‌కు తరలించాడు. మార్గం మధ్యలో లక్ష్మి మరణించినట్టు వైద్యులు నిర్ధారించారు.